క్లుప్తంగా

పీఎఫ్ చందాదారుల సమస్యలు పరిష్కరిస్తాం



బోధన్: పీఎఫ్ చందాదారులు, పెన్షనర్స్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నిజామాబాద్ పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం అసిస్టెంట్ కమిషనర్ మధుసదనచారి తెలిపారు. పట్టణంలోని ఉషోదయ మహిళ జూనియర్ కళాశాలలో గురువారం నిధి ఆప్కే నిక్కట్ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా వివిధ రంగాల కార్మికులు, పీఎఫ్ చందాదారులు, పెన్షనర్స్ హాజరై అధికారులకు దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలు, ఫిర్యాదులను పరిష్కరించారు. ఈపీఎఫ్ సంస్థలో ప్రయోజనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం, అర్హతలకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి



రెంజల్(బోధన్): ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ నిర్వాహకులకు సూచించారు. రెంజల్ శివారులో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. రైతులకు ఇబ్బందులు రానీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పలువురు రైతులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకవచ్చారు. వాటిని పరిష్కరించాలని నిర్వాహకులను ఆదేశించారు. తహసీల్దార్ శశిభూషణ్, ఏపీఎం చిన్నయ్యలు ఉన్నారు.

అలీసాగర్ కెనాల్‌బండ్ పరిశీలన



ఎడపల్లి(బోధన్): మండలంలోని అలీసాగర్ సమీపంలో గల కెనాల్ బండ్‌లను గురువారం అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. బ్లాక్ ప్లాంటేషన్‌లో పచ్చదనాన్ని పెంపొందించడమే కాకుండా పంచాయతీలకు ఆదాయం సమకూరేలా వాణిజ్యపరంగా లాభదాయకమైన, ఫలసాయం అందించే ప్రణాళికలు చేపట్టాలన్నారు. వెదురు వంటి జాతుల మొక్కల పెంపకానికి ప్రోత్సహించాలని సూచించారు. తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఏపీవో గంగారాం పాల్గొన్నారు.

'ఎర్రజొన్న కేసులో క్లీన్‌చిట్'

ఆర్మూర్‌టౌన్: మండలం కేంద్రంలో 2008 సంవత్సరంలో జరిగిన ఎర్రజొన్న పంట డబ్బుల చెల్లింపు కేసులో తనకు జిల్లా కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చినట్లు సీడ్ వ్యాపారి కూనింటి మహిపాల్‌రెడ్డి వెల్లడించారు. ఆర్మూర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను రైతులను మోసం చేయలేదని నాడు కావాలనే కొందరు ఎర్రజొన్నల ఉద్యమం పేరుతో తన ఇంటిని దగ్ధం చేశారని ఆరోపించారు. రైతులు తనకు అండగా నిలవడంతోనే ప్రస్తుతం కోర్టులో కేసు తనకు అనుకూలంగా వచ్చిందన్నారు. అప్పటి ప్రభుత్వం ఒప్పందం ప్రకారం తాను చేసిన సీడ్స్ ప్రాసెసింగ్ వ్యయాలు రూ. 2కోట్ల68లక్షలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని కోరారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా సాధించే వరకు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని న్యాయవాదులు తెలిపారు. జిల్లా సాధన సమితి అధ్వర్యంలో పట్టణంలో న్యాయవాదులు చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 130వ రోజుకు చేరాయి. దీక్షలో హైకోర్టు న్యాయవాది వీరభద్రప్ప, న్యాయవాదులు శంకర్, అర్జున్ రాందర్, హన్మాండ్లు కూర్చున్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

నవీపేట: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ పటిష్టతకు కృషి చేయాలని బీజేపీ పార్లమెంట్ విస్తారక్ శ్రీధర్ పార్టీ శ్రేణులకు సూచించారు. మండల కేంద్రంలోని రఘుపతి రెడ్డి గార్డెన్‌లో గురువారం నవీపేట, రెంజల్ మండలాల పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెపై తొలగని ప్రతిష్టంభన..

- అర్ధరాత్రి వరకూ జేపీఎస్ నాయకులతో సాగిన చర్చలు..
- భవిష్యత్ కార్యచరణపై నేడు కీలక సమావేశం..
- జేపీఎస్‌ల సమ్మెబాట..?



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు (ఫైల్)

సుభాష్‌నగర్/మోర్తాడ్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెపై ప్రతిష్టంభన తొలగలేదు. అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వంతో పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియాతో గురువారం రాత్రి వరకూ చర్చలు కొనసాగాయి. చర్చలు సఫలం కాని పక్షంలో శుక్రవారం నుంచి సమ్మెకు వెళ్తామని ఇప్పటికే నోటీసులను ప్రభుత్వం, జిల్లాల కలెక్టర్లకు అందజేశారు. జేపీఎస్‌ల నోటిఫికేషన్, సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన మేరకు రెగ్యులరైజ్ చేస్తూ జీవో విడుదల చేయాలని, నాలుగేళ్ల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం ముందుంచారు. జిల్లాలోని 530 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో 415 మందికిపైగా జూనియర్ పంచాయతీ, ఔట్‌సోర్సింగ్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ఏప్రిల్ 12, 2019లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరారు. నోటిఫికేషన్ ప్రకారం ప్రొబేషన్ పీరియడ్ ఏప్రిల్ 11, 2022 నాటికే పూర్తయ్యింది. కానీ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రొబేషన్ కాలాన్ని మరో ఏడాది పొడగించారు. పొడిగించిన ఏడాది కూడా ఏప్రిల్ 11, 2023 నాటికే ముగిసింది. ఈ విషయమై అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం పలుమార్లు ప్రభుత్వం, మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి సానుకూల నిర్ణయం రాకపోవడంతో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏప్రిల్ 13న సమ్మె నోటీసు ప్రభుత్వానికి అందజేశారు. 15 రోజుల నోటీస్ కాలం తర్వాత ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లాలని నిర్ణయించారు.

డిమాండ్లలో కొన్ని..

- జేపీఎస్‌లను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయాలి. గడిచిన నాలుగేళ్ల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలి
- ప్రస్తుతం పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ పని చేసిన కాలాన్ని ప్రొబేషన్ పీరియడ్‌గా పరిగణించాలి
- మరణించిన జేపీఎస్ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలి.

చర్చలు విఫలమైతే జిల్లాలో అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరశివారులోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో సమావేశం ఏర్పాటు చేసుకోనున్నారు. సమావేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో చేపట్టే ఆందోళనలు, నిరసనలపై కీలక అంశాలను చర్చించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ, అధికారిక వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల నుంచి జేపీఎస్‌లు లెఫ్ట్ అయ్యారు. కొందరు విధులకు కూడా హాజరుకావడం లేదు

తక్షణమే రెగ్యులరైజ్ చేయాలి



జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తక్షణమే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలి. నిబంధనల ప్రకారం నాలుగేళ్ల ప్రొబేషన్ కాలం ముగిసింది.సీఎం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ జీవో విడుదల చేయాలి. లేకుంటే నిరవధిక సమ్మె చేస్తాం.

– భానుక చంద్రశేఖర్, జేపీఎస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

ఇబ్బందులు కలగకుండా చూస్తాం



జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు వెళ్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతాం. రోజువారీ కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా చూస్తాం. సమ్మె విషయాన్ని జిల్లా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశానుసారం చర్యలు చేపడుతాం.

– డాక్టర్ జయసుధ, డీపీవో

రైతులకు నష్టపరిహారం అందించాలి





ఆర్మూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు.. కోటగిరిలో సీపీఐ ఆధ్వర్యంలో..

ఆర్మూర్‌టౌన్: అకాల వర్షం కారణంగా రైతులు నష్టపోయిన పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపరిహారాన్ని అందించాలని ఆర్మూర్ అసెంబ్లీ బీజేపీ నాయకురాలు ఆలూరు విజయభారతిరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌లు అన్నారు. ఈమేరకు గురువారం ఆయన భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసనగా ధర్నా నిర్వహించి తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తరుగు దందాను వెంటనే అడ్డుకట్ట వేసి చర్యలు చేపట్టాలని అన్నారు. నాయకులు జెస్సు అనిల్ కుమార్, ద్యాగ సరీన్, బొట్ల విజయ్, కర్తన్ మధు, పులి యుగంధర్, నవీన్, దొడ్లే నారాయణ, చిట్టి భాజన్న తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి మండలంలో..

రుద్రూర్: అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం కోటగిరి తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్, నల్ల గంగాధర్, రాజు, రాములు, గంగాధర్, మారుతి, ఈశ్వర్, గంగారాం పాల్గొన్నారు.

రెంజల్ మండలంలో..

రెంజల్(బోధన్): అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం షరతులు లేకుండా కొనుగోలు చేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి వినతిపత్రం అందించారు. ప్రతినిధులు పుట్టినాగన్న, నసీర్, రాజేశ్వర్, పెద్దులు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



రెంజల్‌లో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో..

భీమ్‌గల్ మండలంలో...

భీమ్‌గల్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకొని, వారికి నష్ట పరిహారం చెల్లించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పల్లికొండ నర్సయ్య అన్నారు. అకాల వర్షాలకు తడిసి దెబ్బతిన వరి పంటను ఆయన గురువారం పరిశీలించారు. బాల్కొండ నియోజక వర్గ అధ్యక్షుడు డాన్ శీను, గండికోట రాజన్న లు ఉన్నారు.

మహనీయుల జయంత్యుత్సవ సభ వాయిదా

బోధన్: పట్టణంలో శుక్రవారం నిర్వహించనున్న మహనీయుల జయంత్యుత్సవ సభను వాయిదా వేసినట్లు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీల జిల్లా, డివిజన్ ప్రతినిధులు తెలిపారు. పట్టణంలో గురువారం వారు మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగి రాకపోవడంతో వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. మే మొదటి వారంలో ఉత్సవాలు నిర్వహిస్తామని, త్వరలోనే తేదీలను ఖరారు చేసి ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఎంఎస్‌పీ జిల్లా కో-ఆర్డినేటర్ దల్లా సురేష్, గంగాధర్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.



బోధన్‌లో మాట్లాడుతున్న నాయకులు

వినూత్న రీతిలో వీవోఏల నిరసన

ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో వీవోఏల సమ్మె గురువారం నాలుగో రోజు కొనసాగింది. ఈసందర్భంగా పలు మండలాల్లో వీవోఏలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే ప రిష్కరించాలన్నారు. డిమాండ్లను అంగీకరించే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామ ని వెల్లడించారు.

– మాక్లూర్/రుద్రూర్/బాల్కొండ/భీమ్‌గల్/కమ్మర్‌పల్లి/వేల్పూర్



మాక్లూర్‌లో నిరసన తెలుపుతున్న వీవోఏలు



రుద్రూర్ మండల కేంద్రంలో..



ముప్కాల్ మండల కేంద్రంలో..



వేల్పూర్ మండల కేంద్రంలో..

అక్రమ నిర్మాణం కూల్చివేత

బోధన్‌టౌన్: బోధన్‌లోని అనిల్ టాకీస్ రోడ్డులో కబ్జాకు పాల్పడి అక్రమంగా నిర్మించిన భవనాన్ని అధికారులు శుక్రవారం హైకోర్టు ఉత్తర్వుల మేరకు కూల్చి వేశారు. బోధన్‌కు చెందిన ఖాజా సలావోద్దిన్ తన తండ్రి ఖాజాజలీలొద్దిన్ పేరున గల 360 గజాల స్థలాన్ని గంగుల జీవన్, గంగుల జమున, ఇందూర్ సునిత కబ్జా చేసి, భవనం నిర్మిస్తున్నాడని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. కాగా ఆ స్థలం తమదే నంటు జీవన్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ విషయంలో ఖాజా సలావోద్దిన్ న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. దీంతో భూమిని సర్వే చేయించిన అధికారులు సలావొద్దిన్‌దే అని నిర్ధారించడంతో మున్సిపల్ అధికారులు నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేశారు. 2021లో సదరు భవన నిర్మాణం నిలిపి వేసి సీజ్ చేశారు. ఇదే విషయంలో ఇరు వర్గాలు న్యాయ స్థానాన్ని ఆశ్రయించాయి. ఆధారాలు పరిశీలించిన హైకోర్టు అక్రమ కట్టడాన్ని కూల్చి వేసి ఈ నెల 28న కోర్టుకు హాజరు కావాలని ఆర్డీవో, తహసీల్దార్ మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్‌రావ్, సిబ్బంది పోలీసుల పర్యవేక్షణలో భవనాన్ని జేసీబీతో కూల్చి వేశారు. కూల్చివేత సమయంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ ప్రేమ్‌కుమార్ బందోబస్తు చేపట్టారు.



బోధన్‌లో జేసీబీతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న అధికారులు

దెబ్బతిన్న మామిడి తోటల పరిశీలన



కమ్మర్‌పల్లి: మండలంలోని నాగాపూర్‌లో గాలి వానకు దెబ్బతిన్న మామిడి తోటలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి తిరుమల ప్రసాద్, భీమ్‌గల్ ఏడీఏతో కలిసి గురువారం పరిశీలించారు. పంట నష్టం అంచనా నివేదికను ప్రభుత్వానికి పంపి పరిహారం అందేలా చూస్తానని రైతులకు వారు భరోసా ఇచ్చారు. ఏఓ లావణ్య, ఏఈఓ రమేష్ ఉన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం

పెర్కిట్/రుద్రూర్/రెంజల్/వర్ని/బాల్కొండ: రుద్రూర్ మండలం అంబం(ఆర్) గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్ ప్రారంభించారు. సర్పంచ్ కొర్వ భాగ్యభూషన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రెంజల్ మండలంలోని దూపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ సాయరెడ్డి ప్రారంభించారు. వర్ని మండలంలోని అంతాపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు ప్రారంభించారు. బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ వనజ ప్రారంభించారు. ఆలూర్ మండలం గగ్గుపల్లిలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు వైద్య సిబ్బంది నేత్ర పరీక్షలు నిర్వహించారు.



చిట్టాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వనజ

కనుల పండువగా లక్ష్మీనారాయణుల కల్యాణం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని లక్ష్మీనారాయణ మందిరంలో గురువారం క్షత్రీయ సమాజ్ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణుల కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. అనంతరం యజ్ఞంను నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మిక సాహిత్యం అమూల్యమైనది



బోధన్: ఆధ్యాత్మిక సాహిత్యం ఎంతో అమూల్యమైందని, ప్రతి ఒక్కరూ తెలుసుకుని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని జహీరాబాద్ ప్రాంత ధన్నూర్ మఠాధిపతి వీరేశ్వర శివాచార్య మహారాజ్ ప్రబోధించారు. పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో కొనసాగుతున్న అఖండ శివనామ సప్తాహం ఆఖరి రోజు మఠాధిపతి విచ్చేసి భక్తుల నుద్దేశించి ప్రవచనాలు చేశారు. ఎమ్మెల్యే షకీల్ ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్మన్ వీఆర్‌దేశాయ్, సీనియర్ న్యాయవాది శ్యాంరావు, వీరశైవ సమాజ్ ప్రతినిధులు ప్రారంభించారు.

29నుంచి పంచకుండాత్మక శ్రీరామ మహాయజ్ఞం

రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి గోదావరి నది ఒడ్డున గల శ్రీ సీతారాం ధాం సంత్ సేవాశ్రమంలో ఈ నెల 29నుంచి వచ్చే నెల 5వరకు పంచకుండాత్మక శ్రీరామ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు ఆశ్రమ పిఠాధిపతి సీతారాం త్యాగి మహారాజ్ గురువారం తెలిపారు. ఆలయంలో సీతారామ్‌జీ, వేంకటేశ్వర్, సిద్ధేశ్వర మహాదేవ్, హనుమత్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆధ్యాత్మికం..



వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణం



బోధన్: పట్టణంలోని విజయసాయి హైస్కూల్‌లో గురువారం 24 గంటల హనుమాన్ చాలీసా పారాయణం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా సీతారామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శుక్రవారం ఉదయం వరకు పారాయణం కొనసాగనుంది.

హనుమాన్ ఆలయంలో యజ్ఞం



వర్ని: మండలంలోని వడ్డేపల్లి గ్రామంలోని వీరభయ ఆంజనేయ స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అభిషేకం, సామూహిక హనుమాన్ చాలీసా పారాణం, యజ్ఞం నిర్వహించారు. లింగేశ్వర ఆశ్రమం పీఠాధిపతి బాలయోగి కృష్ణ మహారాజ్, గురు సిద్ధ మణికంఠ శివచార్య మహా స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

ధర్మాన్ని పాటించడమే దైవభక్తి



బాల్కొండ: ధర్మాన్ని పాటించడమే దైవ భక్తి అని జిల్లాలోని పలు ఆశ్రమాల పీఠాధిపతులు అన్నారు. మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ ఆవరణలో గురువారం ఇందూరు సాధు పరిషత్ ఆధ్వర్యంలో 17వ వేదంత విజ్ఞాన సభల సాధు సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో జిల్లాలోని పలు ఆశ్రమ పీఠాధిపతులు పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రవచనలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సమాచారం..

1నుంచి సంస్కార సాధన తరగతులు

భీమ్‌గల్: మే 1నుంచి 25వరకు శ్రీ సరస్వతి విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో సంస్కార సాధన తరగతులు నిర్వహిస్తామని హెచ్ఎం రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలు చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 5నుంచి 12సంవత్సరాల బాలబాలికలు ఈ సంస్కార సాధన తరగతుల్లో పాల్గొనవచ్చని, ఫీజు రూ.250 ఉందని తెలిపారు.

సంక్షిప్తం

వార్డు సభ్యురాలి మృతికి సంతాపం



రెంజల్(బోధన్): రెంజల్ 10వ వార్డు సభ్యురాలు జకేరా గురువారం మృతి చెందడంతో పాలకవర్గం సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ అధ్యక్షతన పాలకవర్గం సభ్యులు సమావేశమై మూడు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ క్యాంపస్ సెలక్షన్‌లో బోధన్ విద్యార్థి ఎంపిక

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అనిరుధ్ పాటిల్ విప్రో కంపనీ నిర్వహించిన ఆన్‌లైన్ క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపిక అయ్యాడని కళాశాల డైరెక్టర్ దుష్యంత్ గురువారం తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని ఆయన అభినందించారు.

జీపీ నిధులతో బోర్లు



వర్ని: మండలంలోని సత్యనారాయణపురంలో గురువారం జీపీ నిధులతో రెండు బోర్లు వేసినట్లు పంచాయతీ కార్యదర్శి సాయిలు వెల్లడించారు. ఉపసర్పంచ్ కంది కృష్ణ, వార్డు సభ్యులు అనిల్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన పెద్ది అనసూయ ఇటీవల మృతిచెందింది. దీంతో బాధిత కుటుంబానికి గురువారం ఆరెంజ్ ట్రావెల్స్ యజమాని ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని సునీల్ యువసేన సభ్యులు అందజేశారు.

మేడే పోస్టర్ల ఆవిష్కరణ



భీమ్‌గల్: మండలంలోని సుభాష్‌నగర్‌లో గురువారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు రాజేశ్వర్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో మేడే వేడుకలను జయప్రదం చేయాలన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం

బోధన్: పట్టణంలోని మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు యాదగిరి ఇటీవల దళిత రత్న అవార్డు పొందారు. ఈసందర్భంగా గురువారం హరిజన సుధార్‌సమితి ప్రతినిధులు ఆయనను సన్మానించి అభినందించారు.